తెలంగాణ ఇమేజ్.. నేషనల్ డ్యామేజ్

15 నెలల కాంగ్రెస్ ప్రభుత్వ పాలనలో తెలంగాణ ఎలా తయారైందో చెప్పే నిష్ఠుర నిజాలివి.

(స్పెషల్ టాస్క్ బ్యూరో)

హైదరాబాద్, మార్చి 18 (నమస్తే తెలంగాణ): నవ్వేటోళ్లే ముందు కాలు జారి పడ్డట్టే అయ్యింది ఇప్పుడు తెలంగాణ పరిస్థితి. 'గుజరాత్ మాడల్' అంటూ పుష్కరకాలం కిందట కాలరెగిరేసిన వాళ్లకు.. దేశానికి కావాల్సిన అసలు సిసలైన మాడల్ ఇదే అంటూ తెలంగాణను దేశానికే ఓ దిక్సూచీగా మార్చారు మాజీ ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖరరావు. అయితే, కేసీఆర్ శ్రమ అంతా ఇప్పుడు బూడిదలో పోసిన పన్నీరు చందంగా మారిపోతున్నది. పదేండ్లు పొత్తిళ్లలో కంటికి రెప్పలా సాదిన బిడ్డ ఇప్పుడు అంగట్లో ఓ వార్తా సరుకుగా మారుతున్నది. దేశానికే ఓ అభివృద్ధి దివ్వెగా నిలిచిన తెలంగాణ పరపతి గాలిలో కలుస్తున్నది. రాష్ట్రానికి పెద్దదిక్కుగా పిలిచే సీఎం రేవంత్‌రెడ్డి అసంబద్ధ, అనాలోచిత వ్యాఖ్యలే ఇందుకు కారణంగా పారిశ్రామికవేత్తలు, రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

అప్పుడు అలా.. ఇప్పుడు ఇలా..

ఆర్థిక క్రమశిక్షణకు, సంక్షేమ పథకాలకు, తలసరి ఆదాయానికి, జీఎస్డీపీ పెరుగుదలకు, పారిశ్రామికాభివృద్ధికి, మౌలిక వసతుల కల్పనకు, కొత్త కంపెనీల రాకకు, ఐటీ ఎగుమతులకు, ఉపాధి అవకాశాలకు, ధాన్యం ఉత్పత్తికి, స్వచ్ఛమైన తాగునీటికి ఇలా ఒక్కటేమిటి పలు రంగాల్లో దేశంలోనే తెలంగాణ అగ్రభాగాన ఉన్నదంటూ కేసీఆర్‌పాలన సమయంలో నిన్నమొన్నటివరకూ జాతీయ మీడియా తెలంగాణను ప్రశంసించింది. అయితే ఇప్పుడు అదే మీడియాలో పొద్దున లేచింది మొదలు తెలంగాణలోని సమస్యల చిట్టానే పుంఖానుపుంఖాలుగా వార్తలను ప్రసారం చేస్తున్నది. ఆర్థిక సంక్షోభంలో తెలంగాణ, ఉద్యోగులకు జీతాలివ్వలేని స్థితిలో తెలంగాణ, తెలంగాణ నుంచి కంపెనీలు బయటకు, నీళ్లు లేక తెలంగాణలో ఎండిపోతున్న పంటలు, కర్ణాటక వాల్మీకి స్కామ్ లింకులు తెలంగాణలో, అప్పులబాధతో బ్యాంకులో తెలంగాణ రైతు ఆత్మహత్య.. ఇలా ఏ ఇంగ్లీష్ పేపర్‌ను చూసినా.. ఏ చానల్‌ను ట్యూన్ చేసినా రోజూ ఇవే వార్తలు కనిపిస్తున్నాయి. దీంతో.. ఎట్లుండె తెలంగాణ.. 15 నెలల్లోనే ఇట్లా అయ్యిందంటూ రాజకీయ విశ్లేషకులు కూడా ఆశ్చర్యపోతున్నారు.

తెలంగాణ పరపతి గాలికి..

'ఎన్నికల బరిలోకి దిగాక వెనుకబడకుండా ఉండాలంటే పరుగెత్తాల్సిందే. ఈ క్రమంలోనే హామీలనిచ్చాం' అంటూ జాతీయ మీడియా 'ఇండియా టుడే' కాంక్లేవ్‌లో సీఎం రేవంత్ రెడ్డి ఒప్పుకొన్నారు. అంతేనా, ప్రభుత్వం తరఫున కనీసం రూ.500 కోట్లను కూడా మౌలిక వసతులకు, పెట్టుబడులకు ఖర్చు చేయలేని పరిస్థితి ఉందంటూ ఇదేదో గొప్పవిషయమన్నట్టు చెప్పుకొచ్చారు. అయితే, రేవంత్ ఈ వ్యాఖ్యలు చేయగానే, ఆ కాంక్లేవ్‌లో పాల్గొన్న పారిశ్రామికవేత్తలు, రాజకీయ విశ్లేషకులతో సహా ముఖ్యమంత్రిని ఇంటర్వ్యూ చేస్తున్న జర్నలిస్టులు రాజ్‌దీప్ సర్దేశాయ్, ప్రీతి కూడా ఫక్కున నవ్వారు. రేవంత్ వ్యాఖ్యలపై ఒకింత ఆశ్చర్యాన్ని కూడా వ్యక్తం చేశారు. ఇదే విషయమై ఆ కాంక్లేవ్‌లో పాల్గొన్న బెంగళూరుకు చెందిన రతన్ మిశ్రా అనే ఓ ఏంజెల్ ఇన్వెస్టర్‌ను 'నమస్తే తెలంగాణ' ప్రతినిధి ప్రశ్నించారు. దీనికి ఆయన స్పందిస్తూ.. 'ఇంట్లో ఎన్ని సమస్యలు ఉన్నప్పటికీ, ఇంటి పెద్దగా వాటిని చక్కబెట్టాలిగానీ సంసారాన్ని బజారున పెడ్తారా? ఇప్పుడు సీఎం రేవంత్ వ్యవహారంకూడా అలాగే ఉంది. రాష్ట్రప్రభుత్వం తరఫున మౌలిక వసతులకు ఏమాత్రం నిధులను కేటాయించే పరిస్థితిలో లేమని ముఖ్యమంత్రే స్వయంగా ప్రకటిస్తే, కొత్త కంపెనీలు రాష్ట్రానికి ఎలా వస్తాయి? యువతకు ఉపాధి ఎలా లభిస్తుంది? అందుకేనేమో తెలంగాణ నుంచి కంపెనీలు వేరే రాష్ట్రానికి తరలివెళ్తున్నాయి' అంటూ మిశ్రా బదులిచ్చారు. ఇలాంటి వేదికలపై సీఎం స్థాయి వ్యక్తి ఇలాంటి ప్రకటనలు చేస్తే తెలంగాణ పరపతి గాలిలో కలిసినట్టేనని మిశ్రా పేర్కొనడం గమనార్హం.

అసెంబ్లీ సాక్షిగా మళ్లీ..

'ఉద్యోగులకు ఒకటో తారీఖున జీతాలు ఇవ్వడానికే కష్టపడుతున్నాం. డీఏ గురించి అడగొద్దు' అంటూ అసెంబ్లీ సాక్షిగా ముఖ్యమంత్రి రేవంత్ ప్రకటించడం, ఆర్బీఐ నుంచి చేబదులు తీసుకొంటున్నట్టు ఆయన చేసిన వ్యాఖ్యలు స్థానిక మీడియాలోనే కాకుండా జాతీయమీడియాలోనూ కలకలం సృష్టించాయి. ఒక్క ఏడాదిలోనే తెలంగాణలో ఈ పరిస్థితులు దాపురించడం ఏమిటంటూ టైమ్స్ గ్రూప్, ఇండియా టుడే వంటి ప్రఖ్యాత చానల్స్ చర్చా కార్యక్రమాలను ప్రసారం చేశాయి. తెలంగాణలో ఆర్థిక సంక్షోభం పెచ్చరిల్లిందంటూ హిందుస్థాన్ టైమ్స్, న్యూస్18, టైమ్స్ నౌ, డెక్కన్ హెరాల్డ్, బిజినెస్ టుడే వంటి న్యూస్‌వెబ్ సైట్లు, టీవీలు ప్రత్యేక కథనాలను ప్రసారం చేశాయి. కాంగ్రెస్ అధికారంలో ఉన్న హిమాచల్ ప్రదేశ్, కర్ణాటక దివాలా అంచుకు చేరుకొన్నట్టే ఇప్పుడు తెలంగాణ కూడా తీవ్రమైన ఆర్థిక సంక్షోభంలోకి కూరుకుపోయినట్టు ఆయా వెబ్‌సైట్లు వార్తా కథనాలను ప్రచురించాయి. అప్పుల గురించి రేవంత్ రెడ్డి వ్యాఖ్యలను ఉటంకిస్తూ ఇన్ఫోసిస్ మాజీ సీఎఫ్‌వో మోహన్‌దాస్ పాయ్ కర్ణాటక కాంగ్రెస్ ప్రభుత్వ తీరును 'ఎక్స్' వేదికగా ఎండగట్టారు. రాష్ట్ర ప్రభుత్వం తీసుకొంటున్న విధానపరమైన నిర్ణయాలను బట్టే రాష్ట్రానికి పరిశ్రమలు క్యూకడతాయని సాయికాంత్ అనే మరో పారిశ్రామికవేత్త అన్నారు. కాగా కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాతనే కార్నింగ్ ఇంటర్నేషనల్ తమిళనాడుకు, కేన్స్ సెమీకండక్టర్ గుజరాత్‌కు తాజాగా ప్రీమియర్ ఎనర్జీస్ ఆంధ్రప్రదేశ్‌కు తరలిపోయిందని 'బిజినెస్ స్టాండర్డ్' ఓ కథనంలో వెల్లడించింది. మొత్తంగా కాంగ్రెస్ పాలనలో, రేవంత్ అనాలోచిత ప్రకటనలతో తెలంగాణ పరపతి అంతకంతకూ దిగజారుతున్నదని సోషల్‌మీడియాలో నెటిజన్లు కామెంట్లు పెడుతున్నారు.

కేసీఆర్ పదేండ్ల పాలనలో తెలంగాణ ప్రస్తావన వస్తే జాతీయ మీడియాలో కనిపించే హెడ్‌లైన్స్ ఇవి

మొన్నటి సంగతి

- ఆర్థిక క్రమశిక్షణకు చిరునామా తెలంగాణ
- తలసరిలో సిరులు కురిపించిన తెలంగాణ
- పారిశ్రామికాభివృద్ధి పథంలో తెలంగాణ
- కంపెనీలకు గమ్యస్థానంగా తెలంగాణ
- ఉపాధి అవకాశాలకు కేరాఫ్ తెలంగాణ
- ధాన్యం ఉత్పత్తిలో టాప్ తెలంగాణ
- అటవీ విస్తీర్ణంలో అగ్రభాగాన తెలంగాణ
- 100% తాగునీరిచ్చిన తొలి రాష్ట్రంగా తెలంగాణ
- ఐటీ ఎగుమతుల అడ్డాగా తెలంగాణ

మరి ఇప్పుడు?

- ఉద్యోగులకు జీతాలు ఇవ్వలేని స్థితికి తెలంగాణ
- ఆర్థిక సంక్షోభంలో చిక్కుకొన్న తెలంగాణ
- ఎండిపోయిన పంటలకు కేరాఫ్ తెలంగాణ
- రైతుల ఆత్మహత్యల అడ్డాగా తెలంగాణ
- కంపెనీలు మర్లిపోతున్న రాష్ట్రంగా తెలంగాణ
- కుంభకోణాలకు కేరాఫ్‌గా తెలంగాణ
- అభివృద్ధి ప్రాజెక్టులు పడకేసిన తెలంగాణ

జాతీయ స్థాయిలో ఏ పత్రికను తిరగేసినా.. ఏ చానల్‌ను ట్యూన్ చేసినా కనిపిస్తున్న వార్తలు ఇవి.

ఆర్బీఐ నుంచి చేబదులు

తెలంగాణ ఆర్థికస్థితి బలహీనంగా ఉన్నది. ప్రభుత్వ ఉద్యోగులకు మొదటితారీఖున జీతాలు చెల్లించడానికి కూడా ఇబ్బందులు పడాల్సి వస్తున్నది. డీఏ చెల్లింపులపై పట్టుబట్టవద్దని ఉద్యోగులకు విజ్ఞప్తి చేస్తున్నా. ఉద్యోగులకు జీతాలు చెల్లించడం కోసం ఆర్‌బీఐ నుంచి రూ. 4 వేల కోట్లను చేబదులుగా రుణం తీసుకొన్నాం.

– అసెంబ్లీ సాక్షిగా రేవంత్ రెడ్డి

ప్రపంచంలోనే తొలి ఏఐ న్యూస్ పేపర్

ప్రచురించిన ఇటలీ వార్తా సంస్థ

న్యూఢిల్లీ, మార్చి 18: ప్రపంచంలో మొట్టమొదటిసారి పూర్తిగా కృత్రిమ మేధతో(ఏఐ) వార్తాపత్రికను ప్రచురించినట్టు ఓ ఇటాలియన్ వార్తా సంస్థ మంగళవారం ప్రకటించింది. ఏఐ టెక్నాలజీ ప్రభావం జర్నలిస్టులు, పత్రికల పనితీరుపై ఏ విధంగా ఉంటుందో తెలుసుకునేందుకు ఒక నెలరోజులపాటు ప్రయోగాత్మకంగా పూర్తి ఏఐ టెక్నాలజీని ఉపయోగించి దినపత్రికను రూపొందించినట్టు ఫాగియో వార్తాపత్రిక డైరెక్టర్ కలాడియో సెరాసా తెలిపారు. ఏఐ టెక్నాలజీతో తయారైన నాలుగు పేజీల ఎడిషన్ మంగళవారం మార్కెట్‌తోపాటు ఆన్‌లైన్‌లో కూడా విడుదలైంది. భవిష్యత్తులో జర్నలిస్టుల పాత్ర చాలా పరిమితం కానున్నట్టు ఆయన తెలిపారు. పత్రికా పరిశ్రమలో ఏఐని ఏ విధంగా ఉపయోగించాలని ప్రపంచ వ్యాప్తంగా వార్తా సంస్థలు ఆలోచిస్తున్న సమయంలో ఇటాలియన్ వార్తాపత్రిక ఈ ప్రయోగం చేసింది.

అమెజాన్‌లో మరో 10 వేల ఉద్యోగాల కోత

ఏఐపై నిపుణుల ఆందోళన

న్యూఢిల్లీ: మరో 10,000 మంది ఉద్యోగులను ఇంటికి సాగనంపుతున్నట్టు గ్లోబల్ ఈ-కామర్స్, క్లౌడ్ కంప్యూటింగ్ దిగ్గజం అమెజాన్ మంగళవారం ప్రకటించింది. 2023 చివరిలో 18,000 మంది ఉద్యోగులపై వేటువేసిన అమెజాన్ దీనికి కొనసాగింపుగా ఇప్పుడు మరో 10,000 మంది ఉద్యోగులకు లే ఆఫ్ ప్రకటించడం సంచలనంగా మారింది. కంపెనీ ఆదాయం తగ్గిపోవడం, నిర్వహణ ఖర్చులు పెరగడం, వినియోగదారుల కొనుగోలు పోకడలలో మార్పులు వంటివి అమెజాన్ ఈ నిర్ణయం తీసుకోవడానికి కారణాలుగా తెలుస్తోంది. ప్రధానంగా రిటెయిల్ డివిజన్, హెచ్‌ఆర్ విభాగాలలో ఈ లేఆఫ్‌లు ఉండనున్నాయి. రెవెన్యూలో ఆటుపోట్లు, అస్థిర ఆర్థిక పరిస్థితి కారణంగా అమెజాన్ తన ఉద్యోగులను వదిలించుకునే చర్యలకు పూనుకుంది.

5 నిమిషాల్లో — ఎలక్ట్రిక్ కారు ఫుల్ చార్జింగ్!

- ఒకసారి చార్జింగ్‌తో 470 కి.మీ. ప్రయాణం
- హన్ ఎల్ సెడాన్ కారును ఆవిష్కరించిన బీవైడీ

బీజింగ్, మార్చి 18: ఎలక్ట్రిక్ కార్ల తయారీలో దూసుకెళ్తున్న చైనా కంపెనీ బీవైడీ.. మరో సంచలనం నమోదుచేయడానికి సిద్ధమైంది. కేవలం 5 నిమిషాల్లో ఫుల్ చార్జింగ్ అయ్యే ఎలక్ట్రిక్ కారును తయారుచేసినట్టు 'బీవైడీ' తాజాగా ప్రకటించింది. కారు బ్యాటరీ ఒకసారి చార్జింగ్‌తో వాహనం 470 కిలోమీటర్లు ప్రయాణిస్తుందని, కారు వేగం 0 నుంచి 100 కిలోమీటర్లు అందుకునేందుకు కేవలం రెండు సెకన్లు తీసుకుంటుందని కంపెనీ వర్గాలు పేర్కొన్నాయి. ఒక కప్పు టీ తాగి వచ్చే సరికి తమ ఎలక్ట్రిక్ కారు బ్యాటరీ ఫుల్ చార్జింగ్ అవుతుందని, పెట్రోల్ లేదా డీజిల్‌ను ట్యాంక్‌లో నింపుకున్నట్టుగా కారు బ్యాటరీ చార్జింగ్ చేయొచ్చునని బీవైడీ తెలిపింది. బ్యాటరీ చార్జింగ్ టైమ్, సింగిల్ చార్జింగ్‌తో వాహనం ప్రయాణించే దూరం.. అనేవి దృష్టిలో పెట్టుకొని 'హన్ ఎల్ సెడాన్' అనే ఎలక్ట్రిక్ కారును తయారుచేసినట్టు బీవైడీ కంపెనీ చైర్మెన్ వాంగ్ ఛాన్ఫూ చెప్పారు. కొత్త ఎలక్ట్రిక్ కారు అమ్మకాల్ని వచ్చే నెల నుంచి మొదలవుతున్నట్టు తెలిపారు. ఇది త్వరలో ఇండియా మార్కెట్లోకి అడుగుపెట్టనున్నదని సమాచారం.

100 కిలోల — బంగారం పట్టివేత

- అహ్మదాబాద్‌లోని ఓ ఇంట్లో స్వాధీనం

న్యూఢిల్లీ, మార్చి 18: గుజరాత్‌లో పెద్ద ఎత్తున బంగారం పట్టుబడింది. ఓ అపార్ట్‌మెంట్‌లోని ఫ్లాట్‌లో కిలోల కొద్దీ బంగారం, డబ్బుల కట్టలు చూసి అధికారులు, పోలీసులు షాక్‌కు గురయ్యారు. సోమవారం సాయంత్రం అహ్మదాబాద్ పల్లీ ప్రాంతంలో ఆవిష్కార్ అపార్ట్‌మెంట్‌లోని ఓ ఫ్లాట్‌పై అధికారులు దాడులు చేపట్టగా, దాదాపు 90 కోట్ల రూపాయల విలువ జేసే బంగారం కడ్డీలు, ఆభరణాలు, నగదు లభ్యమైనట్టు గుజరాత్ పోలీసులు వెల్లడించారు. ఈ దాడులకు సంబంధించి మేఘ షా, అతడి తండ్రి మహేంద్ర షాలను పోలీసులు నిందితులుగా పేర్కొన్నారు. డీఆర్ఐ, ఏటీఎస్ అధికారులు ఫ్లాట్‌కు చేరుకునే ముందు, ఫ్లాట్‌కు తాళం వేసి నిందితులు ఇద్దరూ అక్కడ్నుంచి పారిపోయారని పోలీసులు చెప్పారు. బంగారం మూలాలపై దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు. 'సుమారుగా 95.5 కిలోల బంగారం, ఆభరణాలు, రూ.60-70 లక్షల నగదు సీజ్ చేశాం. నిందితులు అక్రమంగా తరలించిన బంగారం, భారీగా నగదును ఫ్లాట్‌లో దాచిపెట్టినట్టు ఆరోపణలు ఉన్నాయి' అని ఏటీఎస్ అధికారి ఎస్ఎల్ చౌదరీ చెప్పారు.



బీఆర్ఎస్ రాజ్యసభ ఎంపీ వద్దిరాజు రవిచంద్ర, ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ తదితర రాజకీయ ప్రముఖులు మంగళవారం న్యూఢిల్లీలో జరిగిన కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ కుమారుడి వివాహ రిసెప్షన్‌కు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారంతా నూతన వధూవరులను ఆశీర్వదించారు.

గాజాపై విరుచుకుపడ్డ ఇజ్రాయెల్..

400 మందికి పైగా మృతి

- హమాస్ ప్రభుత్వాధినేత కూడా దుర్మరణం
- కాల్పుల విరమణ ఒప్పందం పొడిగింపునకు హమాస్ నిరాకరించడం వల్లే దాడులు
- ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహూ వెల్లడి
- తమకు చెప్పే దాడులు చేశారన్న అమెరికా
- బందీలకు మరణ శాసనమన్న హమాస్

డేర్ అల్ బలాహ్ (గాజా స్ట్రిప్): పశ్చిమాసియా మళ్లీ భగ్గుమంది. గాజా స్ట్రిప్‌పై మంగళవారం తెల్లవారుజామున ఇజ్రాయెల్ వైమానిక దాడులతో విరుచుకుపడింది. ఈ దాడుల్లో మహిళలు, చిన్నారులు సహా దాదాపు 404 మంది ప్రాణాలు కోల్పోయారని, 500 మందికిపైగా గాయపడ్డారని గాజా వైద్య శాఖ అధికారులు వెల్లడించారు. జనవరి నుంచి కాల్పుల విరమణ ఒప్పందం అమలులో ఉన్న తరుణంలో ఇజ్రాయెల్ అనూహ్యంగా ఈ దాడులకు దిగింది. దీంతో ఏడాదిన్నరగా సాగిన యుద్ధం మళ్లీ ప్రజ్వరిల్లే సూచనలు కనిపిస్తున్నాయి. కాల్పుల విరమణకు మధ్యవర్తులుగా వ్యవహరిస్తున్న ఇటలీ, ఖతార్ సహా పలు దేశాలు ఇజ్రాయెల్ దాడులను ఖండించాయి.

అందుకే దాడులు..

కాల్పుల విరమణ ఒప్పందాన్ని మార్చాలన్న ఇజ్రాయెల్ డిమాండ్లను హమాస్ తిరస్కరించడంతో ఈ వైమానిక దాడులు జరిగినట్టు అధికారులు తెలిపారు. ఇక యుద్ధం కొనసాగే అవకాశం ఉందని వారు చెప్పారు. దాడులు జరపడానికి ముందు ఇజ్రాయెల్ తమను సంప్రదించిందని, ఇందుకు తమ మద్దతు తెలియచేశామని అమెరికా వెల్లడించింది. బీట్ హనౌన్ పట్టణంతో సహా తూర్పు గాజాలోని ప్రాంతాల ప్రజలను ఖాళీ చేయవలసిందిగా ఇజ్రాయెలీ సైన్యం ఆదేశించింది. ఇక గాజా స్ట్రిప్ మధ్య భాగం నుంచి తన ఆపరేషన్ కొనసాగించడానికి ఇజ్రాయెల్ సన్నాహాలు చేసుకుంటోంది. రెట్టింపు సైనిక బలంతో హమాస్‌ను అంతం చేసేందుకు ఇజ్రాయెల్ కార్యాచరణ చేపడుతుందని ప్రధాని నెతన్యాహూ కార్యాలయం ప్రకటించింది.

బందీల భవితవ్యం ఏమిటో?

ముస్లింల పవిత్ర రంజాన్ మాసంలో జరిగిన ఈ దాడితో యుద్ధమేఘాలు అలుముకున్నాయి. ఇప్పటికే వేలాదిమంది పాలస్తీనీయులు యుద్ధంలో మరణించారు. అయితే, ఇప్పటికీ హమాస్ చెరలో బందీలుగా ఉన్న పాతిక మంది ఇజ్రాయెలీ పౌరుల భవితవ్యం ఏమిటన్నది ఇప్పుడు ప్రశ్నార్థకంగా మారింది. మళ్లీ యుద్ధం మొదలుపెట్టాలని నెతన్యాహూ తీసుకున్న నిర్ణయం ఇజ్రాయెలీ బందీలకు మరణ శాసనమని హమాస్ సీనియర్ అధికారి ఒకరు తెలిపారు. తన ప్రభుత్వాన్ని కాపాడుకునేందుకు నెతన్యాహూ ఈ చర్యకు దిగుతున్నారని, ఎవరు ఒప్పందాన్ని ఉల్లంఘించారో మధ్యవర్తులు వాస్తవాలు బహిర్గతం చేయాలని అధికారి కోరారు. మంగళవారం దాడులలో నలుగురు హమాస్ సీనియర్ అధికారులు మరణించారని ఆయన చెప్పారు. కాగా, ఇజ్రాయెల్ దాడులు జరిగిన కొన్ని గంటలైన తర్వాత కూడా హమాస్ నుంచి ఎటువంటి దాడులు జరిగినట్టు వార్తలు రాలేదు. కాల్పుల విరమణ ఒప్పందం అమలు జరుగుతుందని హమాస్ ఇప్పటికీ ఆశిస్తోందని ఆ అధికారి చెప్పారు.

గాజాలోని జబాలియాలో ఇజ్రాయెల్ దాడిలో ధ్వంసమైన ఇండ్లు

హమాసే కారణం: అమెరికా

యుద్ధం మళ్లీ రాజుకోవడానికి హమాస్ కారణమని వైట్ హౌస్ నిందించింది. కాల్పుల విరమణ కొనసాగించడానికి వీలుగా బందీలను హమాస్ వదిలిపెట్టి ఉండవలసిందని, కానీ బందీలను విడుదల చేయడానికి హమాస్ నిరాకరించడంతోనే యుద్ధం మళ్లీ మొదలైందని అమెరికా జాతీయ భద్రతా మండలి ప్రతినిధి బ్రియాస్ హగ్స్ తెలిపారు. ఇదిలా ఉండగా ఇజ్రాయెల్‌కు అపరిమిత రాజకీయ, సైనిక సహకారం అందచేస్తున్న అమెరికానే.. గాజాలో జరుగుతున్న మారణకాండకు పూర్తిగా బాధ్యత వహించాలని హమాస్ ఆరోపించింది. ఇజ్రాయెల్ పాల్పడుతున్న దురాక్రమణలో సహకరిస్తున్న ట్రంప్ ప్రభుత్వం మళ్లీ మారణహోమం రగల్చడానికి కారణమైందని హమాస్ పేర్కొంది.

హమాస్ ప్రభుత్వాధినేత మృతి

గాజాలో తమ ప్రభుత్వాధినేత ఇస్సామ్ అల్ దాలిస్‌తోసహా చాలా మంది తమ ఉన్నతాధికారులు ఇజ్రాయెల్ వైమానిక దాడిలో మరణించిట్టు హమాస్ ప్రకటించింది. మృతులలో అంతర్గత భదత్రా శాఖ అధిపతి మహమూద్ అబూ వత్ఫా, అంతర్గత భద్రతా సర్వీసు డైరెక్టర్ జనరల్ బహజట్ అబూ సుల్తాన్ కూడా ఉన్నట్టు తెలిపింది.

ప్రజాస్వామ్య దేశం పోలీస్ రాజ్యంలా ఉండొద్దు: సుప్రీం

న్యూఢిల్లీ: తీవ్రత లేని కేసుల్లో విచారణ ముగిసినప్పటికీ, బెయిల్ పిటిషన్లను కింది కోర్టులు తిరస్కరించడంపై సుప్రీంకోర్టు ఆందోళన వ్యక్తం చేసింది. ప్రజాస్వామ్య దేశం పోలీస్ రాజ్యంలా పనిచేయకూడదని హితవు పలికింది. అవసరం లేకుండా పోలీసులు తమ ఏకపక్ష అధికారాలతో వ్యక్తులను అరెస్ట్ చేస్తున్నారని తెలిపింది. 'ట్రయల్ కోర్టులు పరిష్కరించాల్సిన బెయిల్ పిటిషన్లను సుప్రీంకోర్టు విచారించాల్సి రావడం దిగ్భ్రాంతికి గురి చేస్తున్నది' అని జస్టిస్ ఓకా సోమవారం ఓ బెయిల్ పిటిషన్ విచారణ సందర్భంగా వ్యాఖ్యానించారు. కస్టడీ అవసరం లేనప్పుడు కూడా బెయిల్‌ను దిగువ కోర్టులు నిరాకరించడాన్ని మేధోపరమైన నిజాయితీ లేకపోవడంగా కోర్టు పేర్కొన్నది.

బాలికపై హత్యాచారం.. నిందితుడికి 3 మరణశిక్షలు

భోపాల్: ఐదేండ్ల బాలికను దారుణంగా హింసించి, అత్యాచారం చేసి చంపిన 30 ఏండ్ల అతుల్ నిహాలే అనే వ్యక్తికి మూడు మరణ శిక్షలు విధిస్తూ భోపాల్‌లోని ప్రత్యేక కోర్టు మంగళవారం తీర్పు చెప్పింది. ఈ కేసులో నిందితుడికి సహకరించిన అతడి తల్లి, సోదరికి రెండేళ్ల జైలు శిక్ష విధిస్తూ ప్రత్యేక కోర్టు జడ్జి కుముదినీ పటేల్ తీర్పు చెప్పారు. రాష్ట్రంలో ఒక నిందితుడికి మూడు మరణ శిక్షలు విధించడం ఇదే తొలిసారి. భోపాల్‌లో నివసించే బాలిక 2024, సెప్టెంబర్ 24న అదృశ్యమైంది. నిందితుడి ఫ్లాట్‌లోని డ్రమ్ములో బాలిక మృతదేహం లభ్యమైంది.

వేకువజామున 3.27 గంటలకు

9 నెలల తర్వాత నేడు భూమ్మీదకు సునీతా విలియమ్స్

ఫ్లోరిడా తీరంలోని సముద్ర జలాల్లో 'స్ప్లాష్‌డౌన్'

వాషింగ్టన్, మార్చి 18: డ్రాగన్ స్పేస్‌క్రాఫ్ట్‌లో మరో ఇద్దరు వ్యోమగాములతో కలిసి సునీతా విలియమ్స్, విల్మోర్‌లు భూమి మీదకు ప్రయాణమయ్యారు. వీరు బయల్దేరిన వ్యోమనౌక బుధవారం ఉదయం 3.27 గంటలకు ఇక్కడి ఫ్లోరిడా సముద్ర తీర ప్రాంతంలోని జలాల్లో 'స్ప్లాష్‌డౌన్' (వ్యోమగాములున్న క్యాప్సుల్ నీటిలో పడటం) అవుతుందని నాసా అధికారికంగా తెలిపింది. సముద్రంపై సిద్ధంగా ఉన్న రికవరీ టీమ్స్ వ్యోమగాములున్న చోటకు వెళ్లి.. వారిని సురక్షితంగా తీరానికి తీసుకొస్తారు. అనంతరం వారిని హ్యూస్టన్‌లోని నాసా జాన్సన్ స్పేస్ సెంటర్‌కు తీసుకెళ్తారు. అక్కడ కొద్ది రోజులపాటు ఉంచి.. వైద్య చికిత్సలు జరుపుతారు. కొన్ని నెలలపాటు అంతరిక్షంలో ఉండటం వల్ల, వారి శరీరంలో అనేక మార్పులు వస్తాయి. కండరాలు, ఎముకుల బలం ప్రభావితమవుతుంది. దృష్టిలోపం కూడా రావొచ్చు. దీంతో నాసా 45 రోజుల రిహాబిలిటేషన్ ప్రోగ్రాంలో వ్యోమగాములు తిరిగి శిక్షణ తీసుకోవాల్సి ఉంటుంది.

యుద్ధాన్ని ముగించేందుకు పుతిన్ అంగీకారం!

ట్రంప్‌తో ఫోన్ సంభాషణ

వాషింగ్టన్: ఉక్రెయిన్‌తో జరుగుతున్న యుద్ధాన్ని శాంతియుతంగా ముగించేందుకు రష్యా అధ్యక్షుడు పుతిన్ అంగీకరించారని అమెరికా అధ్యక్ష కార్యాలయం తెలిపింది. ఉక్రెయిన్ ఇంధన, శక్తి వనరుల మౌలిక వసతులపై 30 రోజులపాటు పాక్షిక కాల్పుల విరమణ పాటించేందుకు పుతిన్ సమ్మతి తెలిపారని పేర్కొన్నది. మంగళవారం డొనాల్డ్ ట్రంప్, పుతిన్ మధ్య దాదాపు రెండు గంటలకుపైగా సాగిన ఫోన్ సంభాషణ అనంతరం వైట్‌హౌజ్ ఈ మేరకు ప్రకటన విడుదల చేసింది.

ఛావాతో ప్రజాగ్రహం!

పథకం ప్రకారమే నాగ్‌పూర్ హింస.. మహారాష్ట్ర ముఖ్యమంత్రి ఫడ్నవీస్

నాగ్‌పూర్, మార్చి 18: నాగ్‌పూర్‌లో చోటుచేసుకున్న హింసాత్మక ఘటనలు ముందస్తు ప్రణాళికతో జరిగినవేనని మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్ ఆరోపించారు. ఔరంగజేబు సమాధిపై ఏర్పడిన వివాదానికి సంబంధించిన కేసులో ఇప్పటి వరకు 50 మందిని అదుపులోకి తీసుకున్నామని, నాగ్‌పూర్‌లో పలు ప్రాంతాల్లో కర్ఫ్యూ కొనసాగుతున్నదని ఆయన తెలిపారు. ఛత్రపతి శంభాజీ మహరాజ్ చరిత్ర ఆధారంగా తీసిన ఛావా చిత్రం మొఘల్ చక్రవర్తి ఔరంగజేబ్‌పై ప్రజల్లో ఆగ్రహాన్ని పెంచిందని, అయితే ప్రజలు సంయమనం పాటించాలని కోరారు. మరోవైపు, ఔరంగజేబ్ వివాదంపై ప్రభుత్వం మీద విపక్షాలు ఆగ్రహం వ్యక్తం చేశాయి. రాష్ట్రంలోని ముఖ్య సమస్యలైన నిరుద్యోగం, రుణభారం, రైతుల ఆత్మహత్యలు వంటివి ప్రస్తావించకుండా ప్రజలంతా అశాంతి, అస్థిరత గురించే చర్చించుకునే పరిస్థితులు కల్పించారని శివసేన ఎంపీ ప్రియాంక చతుర్వేది విమర్శించారు.